


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :191 | సోమవారం 14 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695



# బోనమెత్తిన భాగ్యనగరం

## ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** భాగ్యనగరం ఆదివారం బోనమెత్తింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళికి ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి పూజలు చేశారు. తెల్లవారజాము నాలుగు గంటలకు తన సతీమణితో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్ధరాత్రి దాటిన తర్వాత క్యూ లైన్‌లో నిలబడిన భక్తులు బోనాలు సమర్పించడం ప్రారంభించారు. అలాగే ఒడి బియ్యాన్ని సమర్పించారు. ఉజ్జయిని ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఆవరణలో సుమారు రెండు కిలోమీటర్ల వరకూ కోలాహలం నెలకొంది.

2లో



### "పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం"

సికింద్రాబాద్ లష్కర్ బోనాలు జాతర సందర్భంగా శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి కొండా సురేఖతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఉదయం 11.00 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయానికి చేరుకున్నారు. సీఎంకు ఆలయ మర్యాదాలతో పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.

# అంతరిక్షం నుంచి

## శుభాంశు శుక్లా తిరుగు ప్రయాణం!




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరికొందరు వ్యోమగాములు ఈ నెల 14న భూమికి తిరుగు పయనం కానున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:35కి అన్‌డాకింగ్ ప్రక్రియ జరగనుందని నాసా తెలిపింది.

### కవితపై మల్లన్న వ్యాఖ్యలు

# ఖండిస్తున్నాం

## :టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఎమ్మెల్సీ కవిత పై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం అన్నారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ . మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు.




# రాజకీయాలు చాలా కలుషితమయ్యాయి




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలపై, ప్రజాస్వామ్య వ్యవస్థలపై, సమకాలీన పరిస్థితులపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. "రాజకీయాలు ఈ రోజుల్లో చాలా కలుషితమయ్యాయి. ప్రజాస్వామిక విలువలు మరిచిపోతున్నారు. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. అన్నింటినీ గాడిలో పెట్టే బాధ్యత ఇప్పటికీ మీడియాదే" అని తుమ్మల స్పష్టం చేశారు.

# టీచర్లతో మాత్రం పెట్టుకోవద్దు..

## ఎంపీ ఈటల




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఎవరితో పెట్టుకున్నా టీచర్లతో పెట్టుకోవద్దని ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండల కేంద్రంలో టీచర్ అచ్చే మురళి పదవీ విరమణ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. టీచర్లు, ప్రభుత్వ పాఠశాలల గురించి ఈ మధ్య ఎక్కువ చర్చ జరుగుతోందన్నారు.

# తెలంగాణలో కవితను తిరగనీయం

- ఇది నాపై జరిగిన దాడి కాదు యావత్తు బీసీలపై జరిగిన దాడి
- మూడేళ్లలో మీ రాజకీయ భవిష్యత్తు పాతాళంలో పడేస్తాం - కవితకు మల్లన్న వార్నింగ్
- "బీసీలపై దాడులతో ఉద్యమం ఆగదు" - తీన్మార్ మల్లన్న




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తెలంగాణలో తిరగనీయమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. మొన్న మహా టీవీ, నేడు క్యూ న్యూస్ కార్యాలయాలపై దాడి జరిగిందని.. రేపు ఇంకో కార్యాలయంపైనా దాడి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తమపై దాడులు చేయ్యొచ్చు కానీ.. తమ ఆత్మాభిమానాన్ని చంపలేరన్నారు తీన్మార్ మల్లన్న.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కేసీఆర్ విజన్‌కు సాక్ష్యం: కేటీఆర్

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని.. అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు ఏమాత్రం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. నిజమైన నాయకుడు ఒక తరం లేదా ఒక ఎన్నిక గురించి మాత్రమే ఆలోచించరని చెప్పుకొచ్చారు. తరతరాలపాటు తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలే నిజమైన నాయకుడి పనితనమని తెలిపారు కేటీఆర్.




# గాంధీ సిద్ధాంతమే దేశానికి శ్రీరామరక్ష..

## మంత్రి సీతక్క




**న్యూస్ డెస్క్ 13 జులై (కెరటం న్యూస్):** ఎప్పటికైనా భారతదేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామరక్ష అని మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు - స్వదేశీ మేళలో భాగంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య

## : మంత్రి శ్రీధర్ బాబు




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** రాష్ట్రంలో ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంచిర్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు.. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలు చేస్తామని స్పష్టం చేసారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించండి

## మూడు రోజుల్లో సాగునీరు అందిస్తాం : జగదీశ్వర్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం లో రైతంగానికి సాగునీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అన్నదాతలను గొస పెడుతుందని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రైతాంగానికి సాగు నీరు అందించేందుకు కాళేశ్వరం జోన్ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు సిద్దంగా ఉన్నాయని తెలిపారు.. రైతంగానికి నీళ్లవ్వడం చేతకాకపోతే కేసీఆర్ కు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పగిస్తే మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అన్నారు.




# తీన్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలి

- నేను ఒక్క రోజు కూడా తీన్మార్ మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదు
- మీరు బీసీ బిడ్డ కాబట్టి ఏది పడితే అది మాట్లాడతాం అంటే కుదరదు
- ఇది అధికారపరమైన దాడి కాదు.. స్వేచ్ఛపై దాడి
- తెలంగాణ డీజీపీకి ఫిర్యాదు చేసిన కవిత
- మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేయొద్దు - తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలని శాసనమండలిలో ఫిర్యాదు



# తీన్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలి

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** తనపై చేసిన అవమానకర వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్నపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి అధికారికంగా ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, అసభ్య వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొంటూ, మల్లన్నను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉంటుందని, బోనం ఎత్తే ఆడబిడ్డలను అమ్మవారిలా చూస్తామన్నారు. అలాంటి రాష్ట్రంలో ఒక ఎమ్మెల్సీ బాధ్యత లేకుండా పరుష పదజాలంతో విమర్శలు చేయడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “మహిళలు రాజకీయాల్లోకి రావొద్దన్నట్లుగా మాట్లాడటం ఎంతవరకు సమంజసం?” అంటూ ప్రశ్నించారు.

తెలంగాణ జాగృతి తరఫున బీసీ సమస్యలపై గత సంవత్సరంన్నరగా పోరాడుతున్నట్టు కవిత తెలిపారు. తీన్మార్ మల్లన్నపై తామెప్పుడూ విమర్శలేవీ చేయలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, ఆయన తనపై వ్యక్తిగతంగా దౌర్జన్య పదజాలంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జాగృతి కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనకు వెళ్లినప్పుడు, వారిపై కాల్పులకు దిగడం అత్యంత దుర్మార్గమని కవిత మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇదెక్కడి దుర్వినియోగమని ప్రశ్నించారు. “ఇది అధికారపరమైన దాడి కాదు.. స్వేచ్ఛపై దాడి” అని ఆమె వ్యాఖ్యానించారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై తెలంగాణ డీజీపీకి ఫిర్యాదు చేసిన కవిత, తన వెంట పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపై జాతీయ మహిళా కమిషన్‌ను కలిసి ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. తీన్మార్ మల్లన్నను తక్షణమే అరెస్టు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిను కవిత డిమాండ్ చేశారు. “ఇలాంటి విమర్శలు రాజ్యాంగ విలువలకు, మహిళా గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయి. బాధ్యతగల పదవిలో ఉన్న వ్యక్తులు తగిన సంయమనం పాటించాలి” అని పేర్కొన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య : మంత్రి శ్రీధర్ బాబు



మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంచిర్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు.. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలు చేస్తామని స్పష్టం చేసారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, ఇతర సౌకర్యాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోని అన్నిరాష్ట్రాల కంటే ముందు ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో గత ప్రభుత్వం కంటే తాము చాలా ముందు ఉన్నామని తెలియజేశారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇటీవలే మంచిర్యాల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేశామని పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 3 లక్షలకు పైగా అడ్మిషన్లు నమోదు అయ్యాయి. వీరందరికీ నాణ్యమైన విద్య అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థులకు చదువుల గుడులుగా మారాయని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగంలో చేస్తున్న సంస్కరణలకు, సామాజిక సమానత్వానికి తీసుకుంటున్న చర్యలే ప్రతిపక్షాలకు సమాధానం చెబుతాయని శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు.

## అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా తిరుగు ప్రయాణం !



**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరికొందరు వ్యోమగాములు ఈ నెల 14న భూమికి తిరుగు పయనం కానున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:35కి అన్‌డాకింగ్ ప్రక్రియ జరగనుందని నాసా తెలిపింది.

తుది దశలో వీరు ప్రయాణించే క్రూ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ జూలై 15న అమెరికా కాలిఫోర్నియా తీరంలో ల్యాండ్ కానుంది. భూమికి చేరిన వెంటనే వ్యోమగాములను 7 రోజులు ప్రత్యేక క్వారంటైన్‌లో ఉంచుతారని నాసా వెల్లడించింది.

18 రోజుల పరిశోధనా యాత్ర

18 రోజుల అంతరిక్ష యాత్రలో శుక్లా బృందం అనేక కీలక పరిశోధనలు చేపట్టింది. శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు లాంటి వ్యోమగాములు భారరహిత స్థితిలో ప్రయోగాలు చేశారు.

మనుగడపై కీలక పరిశోధనలు

శుక్లా అంతరిక్ష కేంద్రంలో మైక్రోఆల్గేలపై పరిశోధనలు నిర్వహించారు. దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రలకు ఆహారం, ఆక్సిజన్, బయోఫ్యూయల్ వంటి వనరులను అందించగల నమూనాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం. భవిష్యత్తులో భూమికి ఆవల జీవితం సాధ్యమేనని సూచించడానికి ఈ పరిశోధన దోహదపడుతుందని యాక్సియం తెలిపింది.

వాయేజర్ డిస్‌ప్లేస్ అధ్యయనం

శుక్లా బృందం వాయేజర్ డిస్‌ప్లేస్ అధ్యయనం కూడా చేసింది. అంతరిక్షంలో వ్యోమగాముల కంటి కదలికలు, కూర్పు సామర్థ్యం ఎలా ప్రభావితమవుతుందో పరిశీలించారు. కక్ష్యలో వ్యోమగాములు పరిసరాలను ఎలా గుర్తిస్తారు, అక్కడ ఎలా సమన్వయం సాధిస్తారో కూడా అధ్యయనం జరిగింది. దీర్ఘకాల మిషన్లకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో నివాస స్థలాల రూపకల్పనకు ఇది మార్గదర్శకం అవుతుందని యాక్సియం వెల్లడించింది.

అంతరిక్షంలో మైక్రోగ్రావిటీ, అధిక కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు వ్యోమగాముల సెరిబ్రల్ రక్తప్రవాహం, హృదయనాళ వ్యవస్థలను ఎలా ప్రభావితం చేస్తాయో కూడా బృందం పరిశోధించింది. ఈ ఫలితాలు భవిష్యత్ వ్యోమగాములకు మాత్రమే కాకుండా, భూమిపైనే కొన్ని రకాల రోగులకూ ఉపయోగపడతాయని యాక్సియం స్పష్టం చేసింది.

## కవితపై మల్లన్న వ్యాఖ్యలు ఖండిస్తున్నాం : మహేష్ కుమార్ గౌడ్




**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఎమ్మెల్సీ కవిత పై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం అన్నారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ . మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే ఆయన కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడి చట్ట వ్యతిరేకమని మండిపడ్డారు. చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని సూచించారు.

క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని. గన్ మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని స్పష్టం చేసారు. బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమేనని మహేష్ కుమార్ గౌడ్ మరోసారి పునరుద్ఘాటించారు. బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ది పొందాలని చూడడం సమంజసం కాదని హితవు పలికారు.

# రాజకీయాలు చాలా కలుషితమయ్యాయి

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలపై, ప్రజాస్వామ్య వ్యవస్థలపై, సమకాలీన పరిస్థితులపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. “రాజకీయాలు ఈ రోజుల్లో చాలా కలుషితమయ్యాయి. ప్రజాస్వామిక విలువలు మరిచిపోతున్నారు. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. అన్నింటినీ గాడిలో పెట్టే బాధ్యత ఇప్పటికీ మీడియాదే” అని తుమ్మల స్పష్టం చేశారు.

వాటి పక్షపాతాలు, అర్థం లేని ప్రచారాలు తప్ప నిజాలను రాయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. “కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తుంటాయి. వాస్తవాలు రాయండి. సమాజం దృష్టితో వార్తలు రాయాలి. కొన్ని రాతలు బాధ పెడతాయి. అయినా నేను నిజాయితీకి కట్టుబడి ఉంటాను. నాటకీయంగా వ్యవహరించడం నాకు రాదు” అన్నారు తుమ్మల.

తాను మద్దతిస్తున్న అభివృద్ధిలో ఖమ్మం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. “తెలంగాణలో ఖమ్మం నంబర్ వన్ స్థానంలో ఉండాలి” అన్నారు. రాజమండ్రికి గంటలో చేరేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోందని, సెప్టెంబర్ నాటికి దానికి సంబంధించిన ప్రణాళికలు పూర్తవుతాయని చెప్పారు.

ఖమ్మం పరిధిలోని సాగర్ ఏరియాలో 30,000 ఎకరాల్లో సాగు పంట వేశారని, వాటికి అవసరమైన నీటిని అందించేందుకు గోదావరి నుంచి నీరు తీసుకురావడంపై కృషి చేశానని వెల్లడించారు. అలాగే ఇళ్ల స్థలాల విషయంలో నిబంధనలు పాటిస్తూ ప్రాసెస్ ప్రకారం ఇవ్వనున్నట్టు తెలిపారు.

“ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా, సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. అర్హులకు పథకాలు అందేలా చూస్తా” అని తుమ్మల హామీ ఇచ్చారు. మీడియాలో వచ్చే ప్రతి వార్తపై స్పందిస్తానని, సంబంధిత అధికారులతో తనిఖీలు, సమీక్షలు నిర్వహిస్తానని వెల్లడించారు.

తాను ఎప్పుడూ నిజాయితీగా ఉంటానని, ముఖంలోనే నిజం చెప్పే అలవాటు తనదని తుమ్మల వ్యాఖ్యానించారు. “నాకు నష్టం జరిగినా.. నా పద్ధతిని మార్చుకోలేను. భగవంతుడే నన్ను ఈ విధంగా సృష్టించాడు. సమాజం ముందే నా ప్రామాణికత” అని తేల్చి చెప్పారు.

# గాంధీ సిద్ధాంతమే దేశానికి శ్రీరామరక్ష.. మంత్రి సీతక్క

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** ఎప్పటికైనా భారతదేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామరక్ష అని మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు – స్వదేశీ మేళలో భాగంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని కొనియాడారు. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి వారి త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి సమాజానికి గుర్తు చేస్తున్నారని అన్నారు. ఎప్పటికైనా భారతదేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామరక్ష అని, శాంతియుత మార్గంలోనే మనకు విజయం వరిస్తోందన్నారు.

గాంధీ బాటలోనే మనమంతా నడిచి నియంతలను దుర్మార్గులను తరిమి కొట్టామని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్తున్నామని చెప్పారు. అందులో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. మహనీయుల దారిలోనే నడిచి ప్రజలకు మేలు చేస్తామని, ఎప్పటికైనా శాంతి సామరస్యతే గెలుస్తాయన్నారు. కాగా, ఈ సదస్సులో చౌటుప్పల్ ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. గాంధీ బోధించిన స్వదేశీ భావనలు, సుస్థిర జీవన ప్రాముఖ్యతను ఈ సదస్సు చాటిచెప్పింది.

## కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించండి

**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం లో రైతంగానికి సాగునీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అన్నదాతలను గోస పెడుతుందని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రైతాంగానికి సాగు నీరు అందించేందుకు కాళేశ్వరం జోన్ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు సిద్దంగా ఉన్నాయని తెలిపారు.. రైతంగానికి నీళ్లవ్వడం చేతకాకపోతే కేసీఆర్ కు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పగిస్తే మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అన్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మాజీ ఎమ్మెల్యే చందర్ నివాసంలో నేడు విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి లో ముందుకు సాగి సుభిక్షంగా ఉంటే అజ్ఞాని రేవంత్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తిరోగమనం వెళ్లిందన్నారు. మూర్ఖపు పాలనలో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని కేసీఆర్ సుభిక్షంగా ఉంచితే ఇప్పుడున్న సీఎం రేవంత్ రెడ్డి అప్పుల పాలు చేస్తున్నాడు. కాంగ్రెస్ సర్కారు రైతాంగానికి కావాలనే నీళ్లు అందించడం లేదన్నారు..

లక్షలాది ఎకరాలకు కావలసిన సాగునీరు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సరిపడా సాగునీటిని సరఫరా చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీరు లేకపోవడంతో రాష్ట్రంలో ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయి అని అన్నారు. తెలంగాణ రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వినియోగంలోకి తీసుకొచ్చి వ్యవసాయాన్ని వృద్ధి చేయాలని జగదీశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లు, కంపు మాటలతో కాలం వెళ్లదిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, నీళ్ల మంత్రి అజ్ఞానంగా వ్యవహరిస్తున్నారని కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని రేవంత్ రెడ్డి అప్పుల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విలేఖరుల సమావేశం లో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ ,నాయకులు కౌశిక హరి నడిపెల్లి మురళీధర్ రావు పి.టి.స్వామి పెంట రాజేష్ బొడ్డు రవీందర్ నారాయణదాసు మారుతి చిలకలపల్లి శ్రీనివాస్ అచ్చే వేణు నూతి తిరుపతి ఇంజపూరి నవీన్ జిట్టవేన ప్రశాంత్ ఇరుగురాళ్ల శ్రావన్ బుర్ర వెంకటేష్ చింటూ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల గురించి సోయితో మాట్లాడాలి : సిరికొండ మధు సూదనాచారి



**న్యూస్ డెస్క్, 13 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మధుసూదనాచారి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసారు. మహిళల గౌరవాన్ని కాపాడటం తెలంగాణ సంస్కృతిలో భాగమని గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు చోటు లేదని పేర్కొన్నారు.

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని సూచించారు. ముఖ్యంగా మహిళల గురించి మాట్లాడేటప్పుడు సౌమ్యంగా, నోరు అదుపులో అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సున్నితంగా హెచ్చరించారు. తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ, కవితకు వెంటనే బేషరతు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# బోనమెత్తిన భాగ్యనగరం

## ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

నగరం సుభిక్షంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

లష్కర్ బోనాల జాతరలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉజ్జయిని ఆలయంలో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్టాడుతూ.. హైదరాబాద్ నగరం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు చెప్పారు. అమ్మవారి కరుణకటాక్షంతో నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

లష్కర్ బోనాల జాతరలో ప్రముఖులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పిఎల్ శ్రీనివాస్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ తదితరులున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

దేవదాయశాఖ, పోలీసు శాఖ సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాయి. ఆలయం లోపల ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య, కమిషనర్ ఐ. వెంకటరావు సౌకర్యాలు కల్పించారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీసు బందోబస్తును నార్త్ జోన్ డీసీపీ రష్మిక పెర్మల్ చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని ఏర్పాట్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు.

సికింద్రాబాద్ లష్కర్ బోనాలు జాతర సందర్భంగా శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి కొండా సురేఖతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఉదయం 11.00 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయానికి చేరుకున్నారు. సీఎంకు ఆలయ మర్యాదాలతో పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి దంపతులు అందజేశారు. సీఎం వెంట పాల్గొన్న రాష్ట్ర దేవదాయశాఖ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ కూడా అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి కొండా సురేఖకు ఆలయ మర్యాదాలు, పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.

# తెలంగాణలో కవితను తిరగనీయం

మొదటి పేజీ తరువాయి

ఇది తనపై జరిగిన దాడి కాదని.. యావత్తు బీసీలపై జరిగిన దాడి అని ఈ సందర్భంగా మల్లన్న అభివర్ణించారు.

తాను మాట్లాడిన భాష.. తెలంగాణ మాండలికంలోనే ఉందన్నారు తీన్మార్ మల్లన్న. తాను ఎక్కడా అగౌరవంగా మాట్లాడలేదన్నారు. 40 మంది ఒకేసారి తన కార్యాలయంపై దాడి చేశారని వివరించారు. తనకు, తన సిబ్బందికి రెగ్యులర్‌గా క్యూ న్యూస్‌కు వచ్చే వాళ్లకు గాయాలయ్యాయన్నారు. ఈ దాడిపై ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, ఉన్నతాధికారులు.. తనకు ఫోన్ చేసి వివరాలు అడిగారని చెప్పారు.

తెలంగాణ జాగృతి కార్యకర్తలు తన కార్యాలయంపై దాడి చేశారంటూ మల్లన్న మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి తెగబడిందన్నారు. ఇలాంటి చర్యల వల్ల బీసీ ఉద్యమం ఆగిపోతుందనుకుంటే.. అది భ్రమేనని పేర్కొన్నారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి గాయమైందన్నారు. తన గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు యత్నించారని ఆరోపించారు.

ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాము చేసే ప్రయత్నం ఏ మాత్రం తగ్గదని కుండ బద్దలు కొట్టారు. మరింత రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళ్తామన్నారు. ఈ తరహా చర్యలకు తాను భయపడనని చెప్పారు. రాసి పెట్టుకోండి.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత తమదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆగ్రహించారు.

తనపై ఎథిక్స్ కమిటీ సిఫార్స్ చేయాలన్న ఎమ్మెల్సీ కవిత.. ఏ ఎథిక్స్‌తో తమ మీద దాడికి పంపారని తీన్మార్ మల్లన్న సూటిగా ప్రశ్నించారు. తనపై ఎక్కడైనా ఫిర్యాదు చేయండంటూ కవితకు సవాల్ విసిరారు. తమపై దాడి చేసి.. శాసన మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేయడం ఏమిటంటూ మల్లన్న ప్రశ్నించారు. శాసన మండలి ఛైర్మన్ దాడి చేయమని ఏమైనా చెప్పారా?. బీసీల మీద దాడి చేయమని ప్రోత్సహించారంటూ ఎమ్మెల్సీ కవితపై నిప్పులు చెరిగారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలంటున్న కవిత.. ఆమెనే తన కార్యాలయంపై దాడి చేయమని చెప్పారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కవిత వెనక్కి తగ్గడం కాదు.. రేపటి నుంచి బీసీల తడాఖా ఏమిటో చూపిస్తామంటూ బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవితకు తీన్మార్ మల్లన్న వార్నింగ్ ఇచ్చారు.

## టీచర్లతో మాత్రం పెట్టుకోవద్దు.. ఎంపీ ఈటల

మొదటి పేజీ తరువాయి

ప్రవేట్‌కి పంపించిన తల్లిదండ్రులు అప్పులపాలై మళ్లీ ప్రభత్వ పాఠశాలలవైపే చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు క్వాలిఫైడ్ టీచర్లు, కమిట్మెంట్ తో పనిచేస్తున్నారని, స్కూల్స్ లో పిల్లల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఉండే సామాజిక స్పృహ, మానవ సంబంధాలు, ఏదన్నా చేయాలనే తపన కాన్వెంట్ స్కూల్స్ లో చదివే పిల్లలకు ఎక్కువ ఉండదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు గొప్పవారు అయితే టీచర్లను జీవితకాలం గుర్తు పెట్టుకుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పిల్లలు సరిగ్గా చదువుకోక పోతే సమసమాజం సాధ్యం కాదని, పేదరికం పోదని, నిజమైన విద్య కావాల్సింది వీళ్ళకే అని తెలిపారు. అన్ని గవర్నమెంట్ స్కూల్స్‌ను సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. ఇతర దేశాల్లో విద్య ఉచితంగా అందిస్తున్నారని, కానీ మన దగ్గర ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు చూస్తున్నారు. మీరు అందుకు అనుగుణంగా పని చేయాలని కోరారు. ఎవరితో పెట్టుకున్నా టీచర్లతో పెట్టుకోవద్దు అని చెప్తూ ఉంటాను.. ప్రజల ఆలోచనలపై ముద్ర వేయగల శక్తి ఉన్నవారు టీచర్లు.. అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేస్తాను.. అని ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కేసీఆర్ విజన్‌కు సాక్ష్యం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. అలాంటి నాయకుడు కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా రెండు అద్భుత ఫలితాలను తెలంగాణ ఈరోజు సాధించిందని ఉద్ఘాటించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కేసీఆర్ విజన్‌కు మరో జీవన సాక్ష్యమని నొక్కిచెప్పారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ చేయడంతో.. ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి, వ్యవసాయ భూమికి సాగునీరు అందుతోందని వెల్లడించారు. కేసీఆర్ హయాంలోని మరో అద్భుతం యాదాద్రి థర్మల్ ప్లాంట్. దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్ వన్‌లో 72 గంటల కోడ్ ని విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పుకొచ్చారు. తమ నాయకుడు కేసీఆర్ పాలన, విజన్ మా అందరికీ గర్వకారణమని కేటీఆర్ పేర్కొన్నారు.

కెరటం న్యూస్

సోమవారం 14 జులై 2025

# నిర్మాణమే కమ్యూనిస్టు పార్టీల బలం

## సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి వై విక్రమ్




**ఖమ్మం బ్యూరో, 13 జులై (కెరటం న్యూస్):** పార్టీ నిర్మాణమే కమ్యూనిస్టు పార్టీలకు బలమని సిపిఐ(ఎం)ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం అన్నారు. ఖానాపురం హవేలి మరియు రఘునాధపాలెం మండల స్థాయి పార్టీ సభ్యుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. శని ఆదివారాల్లో సిపిఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు స్థానిక సత్తెనపల్లి రామకృష్ణ భవన్ లో జరిగాయి. పార్టీ రాజకీయ తీర్మానం మరియు పార్టీ నిర్మాణం క్లాసులను సిపిఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు బోధిస్తూ పార్టీ సభ్యుల స్థాయి నుండి అఖిల భారత స్థాయి వరకు పార్టీని శక్తివంతంగా నిర్మించాల్సిన అవసరాన్ని సభ్యులకు తెలియజేశారు. కమ్యూనిస్టు పార్టీలు పురుడు పోసుకున్నప్పటి నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఫాసిస్ట్ ప్రభుత్వాల కుట్రలకు బలి అవుతూ వచ్చిన తీరును కార్యకర్తలకు వివరించారు. 1964 నుండి మార్క్సిస్టు పార్టీ భారతదేశంలో విప్లవకర పార్టీగా మాక్సిజం- లెనినిజం ఆధారంగా పనిచేస్తూ కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తూ పెట్టుబడిదారీ ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నదని తెలిపారు. ప్రస్తుత భారత దేశంలో జనతా ప్రజాతంత్ర విప్లవ సాధన కోసం మార్క్సిస్టు పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం కార్మిక కర్షకులను ఐక్యం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండా రమేష్ మతం- మతోన్మాదం అంశాన్ని బోధిస్తూ ఈ దేశంలో మెజార్టీ హిందూ మతోన్మాదం నయా ఫాసిస్టు ధోరణులతో మైనార్టీ వర్గాలపై దాడి చేస్తున్నదని దీనికి ఆర్ఎస్ఎస్ ప్రధాన భూమిక పోషిస్తూ బిజెపి పార్టీ ద్వారా తన ఫాసిస్టు లక్షణాలను దేశంలో అమలు చేస్తుందని అన్నారు. పార్టీ కార్య కర్తలు ఈ హిందూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుండే మతోన్మాద లక్షణాలను నూరిపోస్తూ చరిత్రను వక్రీకరించే పని కేంద్రంలో బిజెపి పార్టీ చేస్తుందని అన్నారు. అనంతరం పార్టీ కార్యక్రమం- సిపిఐ(ఎం) విశిష్టత అనే క్లాసును నర్రా రమేష్ బోధించగా ఈ రెండు రోజుల క్లాసులకు ప్రిన్సిపాల్స్ గా దొంగల తిరుపతిరావు ఎస్ నవీన్ రెడ్డి వ్యవహరించారు. క్లాసులు ముగింపులో కర్తవ్యాలను పార్టీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య నాయకులు కత్తుల అమరావతి, పోతురాజు వెంకటి, గాలి వెంకటాద్రి, గుగులోత్ కుమార్, ఎస్ కే హిమాం, కన్నెగంటి తిరపయ్య, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, మంగమ్మ, గాలి అంజయ్య, వేదగిరి మురహరి, నల్లమల సత్యనారాయణ, మాచర్ల గోపాల్, షరీఫ్, మరియు పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



**చింతకాని, 13 జులై (కెరటం న్యూస్):** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ సమీపంలో తుమ్మలమ్మ వాగు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించిబోయి స్కూటీ మీద నుంచి కింద పడి గాయాల పాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలు మేరకు బోనకల్ నుంచి ఖమ్మం వెళుతున్న ఖమ్మం పట్టణంకు చెందిన సుగుణ అనే మహిళ తుమ్మలమ్మ వాగు సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించిబోయి రోడ్డు పక్కనే స్కూటీ పైనుంచి కింద పడటం జరిగిందనీ దీంతో ఆమెకు అక్కడక్కడ గాయాలయ్యాయి సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగులమీరా, ఏఎస్ఐ లక్ష్మణు లు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఆ క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఖమ్మం నుంచి బోనకల్ వెళ్లే ప్రధాన రహదారిపై ఎప్పుడు ఏ ప్రమాదం జరిగిన వెంటనే ఎస్సై తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని అనేకమంది ప్రాణాలు కాపాడటంతో మండల వాసులు పలువురు అభినందిస్తున్నారు.

# ఖమ్మం జిల్లా 'క్రెడాయ్' అసోసియేషన్ అద్యక్షులుగా బండి కిషోర్



**ఖమ్మం బ్యూరో, 13 జులై (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా క్రెడాయ్ అద్యక్షులు గా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బండి జయకిషోర్. నిన్న రాత్రి హెూటల్ యస్ పార్క్ నందు రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ తో ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఖమ్మం పట్టణప్రముఖులు, బ్యాంకు ఉన్నతా అధికాలు, బిల్డర్ లు బండి కిషోర్ ని ఘనంగా సన్మానం చేసి పలువ్నురు వక్తలు కిషోర్ ని ప్రశంసించారు. న్యాయశాస్త్రం లో పట్టభద్రుడైన కిషోర్ గడిచిన ఇరువైఐదు సంవత్సరాలుగా నిర్మాణరంగంలో సేవలు అందిస్తున్నారు. నాణ్యమైన కనస్ట్రక్షన్ తో పాటు విలువలతో కూడిన వ్యాపారం చేయాలని నిర్మాణ రంగంలో ఎంతో మార్పు కు శ్రీకారం చుట్టారు బండి కిషోర్. బిల్డర్స్ సమస్యలను పరిష్కరిస్తూ ఈ రంగంలో అనుబందంగా ఉన్న వృత్తులను, వ్యాపార్నులను, కార్మికరంగాన్ని ప్రోత్సాహిస్తు రాష్ట్రం లోనే ఖమ్మం జిల్లా క్రెడాయ్ ని ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్ళడంలో బండి కిషోర్ పాత్ర ప్రశంసనీయం.

ఖమ్మంలో ప్రాపర్టీ షోలు నిర్వహించి నిర్మాణరంగానికి ఒక వన్నెతీసుకొని వచ్చి ఖమ్మం పట్టణం ఖ్యాతి తెలంగాణ రాష్ట్రానికి చూపించి మన్ననలు పొందారు. అంతేకాదు ఇంటినిర్మాణంలో వ్యాపారం చేయడం ముఖ్యం కాదు సమాజసేవలో మేము సైతం ముందు ఉంటాముఅని ఇటీవల మున్నేరు వరదల్లో ఖమ్మం తల్లడిల్లి నప్పుడు తక్షణమే స్పందించి మొట్టమొదటి గా అసోసియేషన్ తమ వంతు సహయంగా నీరు,ఆహారం, దుస్తులు, వస్తువులు, వంటసామగ్రి ప్రతీఒక్కరి బాదిత కుటుంబానికి అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకొని జిల్లా మంత్రులు,ఉన్నత అధికారుల మన్ననలు, ప్రశంసలు అందుకొంది ఖమ్మం జిల్లాక్రెడాయ్. దీనిలో భాగంగా నే బండి కిషోర్ సేవలను పరిగణనలోకి తీసుకుని తిరిగి మూడవసారి అద్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శి గా చెరుమిల్లి వెంకటేశ్వర రావు, కోశాధికారి గా వేములపల్లి.నగేష్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా పల్లెర్ల రమేష్, రాష్ట్ర యూత్ సెక్రటరీ గా కొదుమూరి ఉమేష్ మరియు జిల్లా కమిటీ ని ఎన్నుకొన్నారు. ఖమ్మం పట్టణ ప్రముఖ ఇంజనీర్, వ్యాల్యువర్ బోళ్ళ.ప్రభాకర్ రెడ్డి ఎల్ ఐ సీ ఛీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ లోడిగ వెంకన్నయాదవ్ బండి కిషోర్ ను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని ఆర్యా వైశ్య సంఘము ప్రముఖులు కొప్పునరేష్ జిల్లా కమిటీ ని ప్రమాణస్వీకారం చేయించారు.

# యుద్దప్రాతిపదికన పాలేరు సాగర్ యూటీ పనులు పూర్తి

## నేడు నీటిని విడుదల చేయనున్న మంత్రి పొంగులేటి



**కూసుమంచి, 13 జులై (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ ( యూటీ) నిర్మాణ పనులను యుద్దప్రాతిపదికన పూర్తి చేసి రేపటి (సోమవారం )నుంచి 1500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను జిల్లా కలెక్టరు అనుదీప్ దురిశెట్టి తో కలిసి మంత్రి ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ ( యూటీ) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించడం జరిగిందని తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో యూటీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దీనివలన ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో రోజు కు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.



# రైతులకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం

## రాష్ట్ర మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, 13 జులై (కెరటం న్యూస్):** రైతులకు అన్ని వేళలా ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి నేలకొండపల్లి మండలంలోని వ్యవసాయ భూముల వద్ద పర్యటించి పల్లె ప్రజల జీవనశైలిపై పరిశీలన చేశారు. మంత్రి, మొదటగా పెసర పంట పొలాలను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. పంటల పెంపకం, సాగు పరిస్థితులు, సాగునీటి సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వరి నాటుతో కూడిన కూలీలను పొలాల్లోనే కలసి, వారి జీవన స్థితిగతులపై చర్చించారు. మహిళా కూలీలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు, వేతనాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి మంత్రి వివరంగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పంట స్థితిగతుల పరిశీలన మాత్రమే కాదు, పల్లె జీవన వ్యవస్థపై అవగాహన పెంచుకునే ప్రయత్నమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు బంధు, వేతన హక్కు వంటి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రజల నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాలు సేకరించడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం రైతు భరోసా క్రింద ఎకరానికి 12 వేలు అందిస్తుందని అన్నారు. కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలు నేరుగా రైతు భరోసా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయ అధికారిణి రాధ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు వున్నారు.

కెరటం న్యూస్

సోమవారం 14 జులై 2025

# టీటీ కోచ్ సాంబమూర్తికి అరుదైన సత్కారం

హైదరాబాద్ బ్యూరో, 13 జులై (కెరటం న్యూస్): ఉత్తమ కోచ్ అవార్డుతో సత్కరించిన తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, సెక్రెటరీ మరియు టేబుల్ టెన్నిస్ కోచ్ సాంబమూర్తి ని ఆదివారం హైదరాబాద్లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఖమ్మం నుంచి ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తున్నందుకు గాని ఉత్తమ కోచ్ అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డును పురస్కరించుకొని ఖమ్మం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ ఉపాధ్యక్షులు ఉప్పల్ రెడ్డి గౌరవాధ్యక్షులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ గారు డాక్టర్ జంగాల సునీల్, కొండా శ్రీధర్, డాక్టర్ ప్రవీణ్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పరిటాల చలపతి, షేక్ మజ్హార్, గద్దల రామారావు, జోజీ చాకో, అనెం రాజేష్, రెడ్డి సాయి, ఇలాప్రోలు లాలయ్య, కామేశ్వరి, భవ్య చందు, లీగల్ అడ్వైసర్ లలిత, శివ,మనోహర్, రంగా వసంత



నాయుడు, జిల్లా క్రీడా అధికారి సునీల్ కుమార్ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పుట్టా శంకర్, క్రిస్టోఫర్, వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా కోచ్ లు, తల్లితండ్రులు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

# కోట శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు



మూవీ న్యూస్, 13 జులై (కెరటం న్యూస్): సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది. ఇందులో అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు చేశారు.తన విలక్షణ నటనతో తెలుగు సినీ ప్రియులకు చేరువైన కోట శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో ఆయన కన్నుమూశారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# ఇక ఆ నినాదానికి అర్థం ఏముంది?

## : రాధికా యాదవ్ హత్య కేసుపై ది గ్రేట్ ఖలీ



స్పోర్ట్స్ న్యూస్ ,13 జూలై (కెరటం న్యూస్):హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25)ను తండ్రి దీపక్ యాదవ్ (49) హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై 'ది గ్రేట్ ఖలీ'గా పేరుపొందిన వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) స్టార్, భాజపా నేత దలీప్ సింగ్ రాణా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ.. రాధికా యాదవ్ హత్య ఘటనను ప్రస్తావించారు. ఒక వ్యక్తి తన సొంత కుమార్తెను హత్య చేయడం చాలా దురదృష్టకరమన్నారు. ఇలా వివిధ కారణాలతో మన కుమార్తెలను మనమే చంపేస్తుంటే 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదానికి అర్థమేముంటుందని ప్రశ్నించారు.

దేశం అభివృద్ధి చెందాలని ఎంత అనుకున్నా.. మన సామాజిక పరిస్థితులు, మనస్తత్వాలు మారనంత వరకు మనం విశ్వగురువుగా మారలేమని దలీప్ సింగ్ వ్యాఖ్యానించారు. స్త్రీలు పురుషుల కంటే ఏ విషయంలోనూ తక్కువ కాదని.. ప్రతి ఒక్కరూ తమ కుమార్తెలను అన్ని రంగాలలో ప్రోత్సహించాలన్నారు. భవిష్యత్తులో మరింత మంది మహిళలు క్రీడారంగంలోకి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25) గురుగ్రామ్‌లో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటోంది. గురువారం రాధిక ఇంట్లో వంట చేస్తుండగా.. తండ్రి దీపక్ యాదవ్ వెనక నుంచి ఆమెపై తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. తన సంపాదనపై ఆధారపడి బతుకుతున్నారంటూ కుమార్తె అవహేళన చేయడంతోనే తండ్రి ఈ హత్యకు పాల్పడ్డారని మొదట వార్తలు వచ్చాయి. అయితే, ఆ కుటుంబంతో పరిచయం ఉన్నవారు మాత్రం ఆ కథనాల్లో వాస్తవం లేదని చెబుతున్నారు. రాధిక మ్యూజిక్ రీల్స్ చేయడం కూడా ఆమె తండ్రికి ఇష్టం లేదని, ఇది కూడా హత్యకు ఓ కారణమై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# 'విలువలు' ముసుగులో కళను చంపొద్దు..



మూవీ న్యూస్, 13 జులై (కెరటం న్యూస్): హాలీవుడ్ నుంచి వచ్చిన సూపర్‌మ్యాన్ సినిమాలోని పలు సన్నివేశాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కత్తిరించడంపై పలువురు సినీ ప్రముఖులు తప్పుబడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఉన్న ముఖ్యమైన 33 సెకండ్ల ముద్దు సన్నివేశాన్ని ఇండియన్ వెర్షన్‌లో కట్ చేయించింది సెన్సార్ బోర్డు. దీంతో ఈ విషయంపై బాలీవుడ్ నటి శ్రేయా ధన్వంతరి ఆగ్రహం వ్యక్తం చేసింది. సూపర్‌మ్యాన్ సినిమాలో ముద్దు సన్నివేశం తొలగించారని తెలిసింది. ఏం దిక్కుమాలిన చర్య ఇది. మనల్ని థియేటర్‌కి రమ్మన్ని పైరసీని ఎంకరేజ్ చేయవద్దని సెన్సార్ వాళ్లు కోరతారు. కానీ వాళ్లేమే ఇలాంటి పనులు చేస్తున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. థియేటర్‌కు వెళ్ళే అనుభవాన్ని ఎందుకు ఇంత దారుణంగా మారుస్తారు? మేము ఏం చూడాలనుకుంటున్నామో మమ్మల్ని నిర్ణయించుకోనివ్వండి. మా సమయంతో, మా డబ్బుతో ఏం చేయాలో మమ్మల్ని డిసైడ్ అవుతాము అంటూ శ్రేయా రాసుకోచ్చింది.అయితే ఈ విషయంపై తాజాగా తన వంతు గొంతు కలిపాడు టాలీవుడ్ దర్శకుడు తరుణ్‌భాస్కర్. సెన్సార్ తీసుకున్న ఈ నిర్ణయంపై తరుణ్ స్పందిస్తూ.. ఇంటర్నెట్ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో, 'విలువలు' నేర్పించాలనే పేరుతో సినిమాలను సెన్సార్ చేయడం కాలం చెల్లిన పద్ధతిగా, హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఇది కళను నియంత్రించడానికి, నైతిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి చేసే ఒక తప్పుడు ప్రయత్నం. సమాజానికి కథల నుంచి రక్షణ కావాలన్నట్లుగా ఉంది. ఇది సంస్కృతిని కాపాడడం కాదు. వ్యక్తిగత అహంభావాలను పెంచి పోషించడమే. ఇది నిజంగా బాధాకరం అంటూ తరుణ్ రాసుకోచ్చాడు.

# జ్యోతి ట్రిపుల్ ధమాకా




స్పోర్ట్స్ న్యూస్ ,13 జూలై (కెరటం న్యూస్):ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత ఆర్చర్లు పతక బోణీ కొట్టారు. తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ.. ఏకంగా మూడు విభాగాల్లో పతకాలు సాధించి సత్తాచాటింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించిన జ్యోతి.. కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌తో పాటు మిక్స్‌డ్ విభాగంలోనూ మెడల్స్ సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల కాంపౌండ్ ఇండివిడ్యూవల్ ఫైనల్‌లో జ్యోతి.. 147-148తో బ్రిటన్ ఆర్చర్ ఎల్లా గిబ్సన్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఇక కాంపౌండ్ ఈవెంట్ ఫైనల్‌లో జ్యోతి, పర్‌నీత్ కౌర్, ప్రతీక ప్రదీప్‌తో కూడిన భారత త్రయం.. 225-227తో చైనీస్ తైపీ చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో ఇరు జట్లు తలా 57 పాయింట్లు సాధించగా.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి కంటే భారత్ 2 పాయింట్లు ముందంజలోనే ఉంది. మూడో గేమ్‌లో తైపీ ఆర్చర్లు భారత్ ఆధిక్యాన్ని ఒక పాయింట్‌కు తగ్గించగా కీలకమైన నాలుగో గేమ్‌లో జ్యోతి బృందం 55 పాయింట్లు స్కోరు చేయగా తైపీ ఆటగాళ్లు 58 పాయింట్లతో స్వర్ణాన్ని ఎగురేసుకుపోయారు. ఇక ఇదే విభాగం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పోరులో జ్యోతి, రిషభ్‌తో కూడిన భారత్.. 156-153తో ఎల్ సాల్వెడార్‌ను ఓడించి కాంస్యం గెలుచుకుంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సెమీస్ చేరిన పర్‌నీత్ కౌర్.. నాలుగో స్థానంలో నిలిచింది.

# మలయాళంలో వర్క్ అంటే ఎంతో భయపడ్డా: శిల్పా శెట్టి



మూవీ న్యూస్, 13 జులై (కెరటం న్యూస్): బాలీవుడ్ నటి శిల్పాశెట్టి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కేడీ: ది డెవిల్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కొచ్చిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శిల్పాశెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటివరకూ వివిధ భాషా చిత్రాల్లో నటించానని చెప్పిన ఆమె.. మలయాళ చిత్ర పరిశ్రమలో వర్క్ చేయాలంటే మాత్రం భయపడ్డానని అన్నారు. అందుకు గల కారణాన్ని కూడా వెల్లడించారు.

"కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకూ వివిధ భాషల్లో యాక్ట్ చేశాను. హిందీతోపాటు తెలుగు, తమిళం, కన్నడలో విభిన్నమైన చిత్రాల్లో నటించాను. అయితే, మలయాళ చిత్ర పరిశ్రమలో పనిచేయడానికి మాత్రం నేనెంతో భయపడ్డా. అందుకే ఆ పరిశ్రమ నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిని అంగీకరించలేకపోయా. వ్యక్తిగతంగా నాకు మలయాళ చిత్ర పరిశ్రమ అంటే గౌరవం ఉంది. మలయాళీ చిత్రాలు చూస్తుంటా. భావోద్వేగాలను ఎంతో చక్కగా స్క్రీన్ మీదకు తీసుకువస్తారు. అక్కడి వారి వర్క్ చూసి ఎన్నోసార్లు ఆశ్చర్యపోయా. ఆ పరిశ్రమలో ఏదైనా సినిమా అంగీకరిస్తే.. నా పాత్రకు సరైన న్యాయం చేయలేనేమోననిపిస్తుంది. అందుకే ఇప్పటివరకూ అక్కడ సినిమా అంగీకరించలేదు. భవిష్యత్తులోనైనా ధైర్యం తెచ్చుకుని యాక్ట్ చేస్తానేమో చూడాలి. జీవితంలో తప్పకుండా ఒక్క మలయాళ సినిమా అయినా చేస్తా" అని ఆమె తెలిపారు.

ఆ చిత్రపరిశ్రమకు సంబంధించి అగ్ర నటుడు మోహన్‌లాల్ అంటే తనకెంతో ఇష్టమని ఆమె చెప్పారు. "భారతీయ చలన చిత్రపరిశ్రమలో ఉన్న గొప్ప నటుల్లో మోహన్‌లాల్ ఒకరు. ఆయన అద్భుతంగా నటిస్తారు. ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఉంది. అవకాశం వస్తే తప్పకుండా వర్క్ చేస్తా" అని తెలిపారు.